క్లుప్తంగా

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



తెనాలి అర్బన్: వైఎస్సార్ సీపీ నాయకుడు మునిపల్లి వంశీ జన్మదినాన్ని పురస్కరించుకుని బస్టాండ్ సమీపంలోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి చలివేంద్రంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, ఎన్ఆర్‌కె శర్మ, షేక్ కాలేషా, సుభాని, పవన్, మౌలాలి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలి అర్బన్: యంగ్ జనరేషన్ సంస్థ ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. పలువురు వికలాంగులకు బియ్యం అందించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ షాదిక్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు నవీన్, ధీరజ్, సాయి, వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడిబాట ప్రచారం



తెనాలి: ప్రభుత్వ ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య చేపట్టిన బడిబాట ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలో 'దండోరా-మైక్ ' ప్రచారం చేశారు. నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించారని, ఇటీవల టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ సంస్థలకు దీటుగా మెరుగైన ఫలితాలను సాధించారని వెంకయ్య గుర్తుచేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వై.లక్ష్మి, డి.కుమారి, కె.రత్నకుమారి, బి.మణెమ్మ, బి.సలోమి, జె.సువార్తమ్మ, డప్పు కళాకారుడు నగేష్ పాల్గొన్నారు.

వీర బ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవం

చుండూరు(వేమూరు): వీర బ్రహ్మేంద్ర స్వామి ఆశీస్సులు ప్రతి కుటుంబానికి ఉండాలని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలంలోని దుండిపాలెం గ్రామంలో ఆదివారం వీర బ్రహ్మేంద్రస్వామి పరివార దేవతా ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంచెల భగద్గీత, వెంకట రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనపురెడ్డి రాఘురామి రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాదె శివరామ కృష్ణా రెడ్డి, సీనియర్ న్యాయవాది దాట్ల మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

మంగళగిరి, మంగళగిరి టౌన్: ఈనెల 31వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు ఒంగోలులో జరిగే ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ (మెన్, ఉమెన్) ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీలకు గుంటూరు జిల్లా తరుపున క్రీడాకారులను ఆదివారం మంగళగిరి ఫిట్‌జోన్ జిమ్‌లో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కర రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధానిలు మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా వ్యాప్తంగా మహిళా పవర్ లిఫ్టర్స్ 15 మంది, మెన్ పవర్ లిఫ్టర్స్ 11 మంది కలిపి మొత్తం 26 మంది హాజరయ్యారని తెలిపారు. హాజరైన వారిలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ టీమ్‌లను ఎంపిక చేశామని అన్నారు. ఎంపికైన క్రీడాకారులను గుంటూరు జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్.ఎస్.వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు బి.ప్రసాద్, భాస్కరావు, బొలినేని చంద్రిక అభినందించారు.

దేవుని మహిమలు ఎనలేనివి

ఫిరంగిపురం: దేవుని మహిమలు ఎనలేనివని విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో ఆదివారం ప్రత్యేక శ్రీసభ దివ్యపూజాబలి నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేస్తూ ప్రతి ఒక్కరూ దేవునితో భక్తితో మెలగాలని, ప్రేమతత్వాన్ని కలిగి ఉండాలని చెప్పారు. ఆత్మఫలాలైన ప్రేమ, ఆనందం, శాంతి, విశ్వసనీయత, నిగ్రహం, శాశ్వతరం, సహనం, మంచితనం ప్రతి ఒక్క విశ్వాసునిలో ఉండాలన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు.



బుర్రిపాలెం వద్ద రేపల్లె మెయిన్ డ్రెయినులో..



రూరల్ కఠెవరం వద్ద పడమర కాల్వలో..

అంతా పూడిక.. ముందుకు సాగుక..!

వ్యవసాయ సజావుగా సాగాలంటే పంటకాల్వల ద్వారా అవసరమైన నీరు సక్రమంగా అందాలి. వర్షాలు కురిసినపుడు లేదా వరదలు సంభవించినపుడు చేలల్లో నిలిచిన నీరు సత్వరం బయటకు వెళ్లాలి. అప్పుడే రైతులకు మేలు చేకూరుతుంది. ఏటా వేసవిలో దీనికోసం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పనులను చేపడుతుంటారు. చేయాల్సిన పనులు, వాటి అంచనాలను సిద్ధం చేసి టెండర్లను పిలిచి, కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. మొత్తం 5.71 లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన కృష్ణా పశ్చిమ డెల్టాలో ఈ వేసవిలో చేయాల్సిన ఓ అండ్ ఎం పనులకు సాగునీటి సంఘాలు ఇప్పటివరకు శ్రీకారం చుట్టలేదు. పంట కాల్వలు, మురుగు కాల్వల్లో తూటాకు, గుర్రపుడెక్క విపరీతంగా పెరిగిపోయింది. జూన్ రెండో వారంలో పశ్చిమ డెల్టా పంట కాల్వలకు సాగు నీటిని విడుదల చేస్తుంటారని తెలిసిందే. ఇప్పటినుంచి మూడు వారాల సమయం కూడా లేదు. కాల్వల్లో పూడికతీత, లాకుల షట్టర్ల మరమ్మతుల విషయంలో అటు పాలకులు, ఇటు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా యుద్ధప్రాతిపదికన తగిన చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. సకాలంలో పనులు పూర్తి చేస్తేనే సాగు నీరు అందుతుందని తెలిపారు.

– తెనాలి



తెనాలి వద్ద కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని పడమర పంట కాల్వ పరిస్థితి



తెనాలిలో తూర్పు కాల్వలో..

బహుముఖ ప్రజ్ఞాశాలి ఆర్ఎన్ గోపాలకృష్ణ

సంస్మరణ సభలో ప్రముఖుల నివాళి



ఆర్ఎన్ గోపాలకృష్ణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తెనాలి: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, పాత్రికేయుడిగా, వైఖానస ఆగమాచార్యుడిగా వివిధ భూమికలను పోషించిన రొంపిచర్ల నాగ గోపాలకృష్ణమాచార్యులు (ఆర్ఎన్ గోపాలకృష్ణ) బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రథమ వర్ధంతి సంస్మరణ సభలో పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని గురవయ్య కాలనీలో గల బ్రాహ్మణ అపర కర్మశాల హాలులో ఆదివారం ఏర్పాటైన సభకు వైఖానస సేవాసంఘం అధ్యక్షుడు మేడూరి శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు. రాష్ట్ర అర్చక సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి తమిరిశ అనంతాచార్యులు మాట్లాడుతూ యౌవనదశలో కమ్యూనిస్టు భావాలు కలిగిన గోపాలకృష్ణ, తర్వాతి కాలంలో ఆధ్యాత్మికం వైపు పయనించినట్టు చెప్పారు. భారతీయ సాహిత్య పరిషత్‌ను స్థాపించి, అనేక కార్యక్రమాలను నిర్వహించామన్నారు. గోపాలకృష్ణ సంపాదకత్వంలో 'అర్చక ప్రగతి' పేరుతో త్రైమాసిక పత్రిక తీసుకొచ్చినట్టు గుర్తుచేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ గోపాలకృష్ణ కుటుంబానికన్నా సమాజానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారని చెప్పారు. సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ ఎందరో విలేకరులను తీర్చిదిద్దిన గోపాలకృష్ణ ప్రేరణతోనే పాత్రికేయ వృత్తిలోకి నడిచిన తాను, నేడు సినీ దర్శకుడిగా ఎదగగలిగానని తెలిపారు. ఆయన పేరిట ఏటా ఉత్తమ విలేకరికి స్మారక అవార్డును బహూకరించాలని ప్రతిపాదించారు. రాష్ట్ర అర్చక సేవాసంఘం అధ్యక్షుడు నారాయణం వేణుగోపాల్ మాట్లాడుతూ వైఖానస సంఘాలకు సలహాలు, సూచనలతో చివరివరకు చేదోడుగా ఉన్న గోపాలకృష్ణ మృతి తీరనిలోటని చెప్పారు. రంగస్థల, సినీ నటుడు వేమూరి విజయభాస్కర్ మాట్లాడుతూ గోపాలకృష్ణతో తనకు గల అనుబంధాన్ని స్మరించుకున్నారు. వివిధ రంగాల ప్రముఖులు అక్కల రామకృష్ణ, టి.రఘు, తమ్మా శివారెడ్డి, కొల్లా సీతారామయ్య, షణ్ముకేశ్వరరావు, జహీర్, రొంపిచర్ల కిరణ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. తొలుత ఆర్ఎన్ గోపాలకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు.

వీరాంజనేయ స్వామి ఆలయంలో గోపూజ

జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆగమ శాస్త్రం ప్రకారం గోపూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం ఆలపాటి భార్గవ సాయి దంపతులు స్వామి వారికి పంచామృత అభిషేకం జరిపించి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం పల్లకి ఉత్సవం, స్వామికి అష్టోత్తర సహస్ర నామార్చన జరిపి భక్త సమాజాల వారు హనుమాన్ చాలీసా పారాయణ, భజన కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దేశభక్తి చాటేలా 'జై జవాన్‌కు వందనం'

తెనాలి: 'ఆపరేషన్ సిందూర్'లో వీరజవాన్ల గౌరవార్థం 'జై జవాన్‌కు వందనం' కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం తెనాలిలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి నాదెండ్ల మనోహర్, విశిష్ట అతిథిగా మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి హాజరయ్యారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీ శిల్పకారులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలు రూపొందించిన భరత మాత, ఛత్రపతి శివాజీ విగ్రహాలను అతిథులు ఆవిష్కరించారు. జై జవాన్ విగ్రహానికి వెంకటేశ్వరరావు, కొండమ్మ దంపతులు నుదుటిన సిందూర తికలం దిద్దారు. పాలాభిషేకం చేశారు. శిల్పులు, సిబ్బంది పాల్గొన్నారు.



విగ్రహాల వద్ద మంత్రి మనోహర్

ప్రజారోగ్యానికి పెద్దపీట

కొల్లిపర: పేదల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఈ శిబిరాన్ని ఆయన ఆధ్వర్యంలో వైద్యులు ప్రారంభించారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా శిబిరం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. 822 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. మరో ఐదుగురు రోగులను జిల్లా వైద్యశాలకు రిఫర్ చేశారు. 20 మంది వైద్యులు, 50 మంది వైద్య సిబ్బంది సేవలందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె. విజయలక్ష్మి, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్నపూర్ణ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి.వి.రంగారావు, జిల్లా వైద్యశాల డాక్టర్ హనుమంతరావు, సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ భరత్, వివిధ మండలాల నుంచి వచ్చిన వైద్యాధికారులు పాల్గొన్నారు.

పింఛను మంజూరు పత్రాలు పంపిణీ

కొల్లిపర: వింతతు మహిళలకు వెంటనే పింఛను అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం మెగా వైద్య శిబిరం అనంతరం వితంతువులకు పింఛను మంజూరు పత్రాలను ఆయన అందించారు. జూన్ మొదటి తేదీన మండల పరిధిలోని 105 మంది లబ్ధిదారులకు కొత్తగా పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు. సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచి పిల్లి రాధిక, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఈఓపీఆర్‌డీ సీహెచ్ భార్గవ్, వీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

తెనాలి టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఇద్దరు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించినట్లు ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.ప్రసూనదేవి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఐతానగర్‌లోని హైస్కూల్‌లో దాత, కృష్ణవేణి వాటర్ ప్లాంట్ అధినేత మల్లిబోయిన నాగరాజు ఆర్థిక సహకారంతో ఎస్‌కే.ఫరీద్, బి.లక్ష్మీమాధురిలకు రూ.5 వేల చొప్పున నగదు ఆదివారం అందజేశారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలని, జీవితంలో ఉన్నతంగా రాణించి కుటుంబానికి మంచి పేరు తేవాలని దాత నాగరాజు ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను, ఎన్‌సీసీ మాస్టర్ బెల్లకొండ వెంకట్‌ను సత్కరించారు. తిరుమలశెట్టి ఉమాశంకర్, విద్యా కమిటీ చైర్మన్ గాలి కిరణ్, చిలకపాటి సింహాద్రి, పి.విజయ్‌కుమార్, షేక్ సానా, ఏఎస్ ఝాన్సీవాణి, విమలకుమారి, షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు అందజేస్తున్న మల్లిబోయిన నాగరాజు

20 నుంచి తెనాలిలో క్రికెట్ లీగ్

తెనాలి టౌన్: స్థానిక వీఎస్సార్ కళాశాలలో ఈ నెల 20 నుంచి జూన్ 5వ తేదీ వరకు కేసీఎల్ క్రికెట్ లీగ్ నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్‌లను యువత సద్వినియోగం చేసుకోవాలని కృష్ణబలిజ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోలా అశోక్ కోరారు. ఆదివారం స్థానిక వీఎస్సార్ కళాశాల గ్రౌండ్‌లో మ్యాచ్‌కు సంబంధించి పోటీలో పాల్గొనే టీమ్ వివరాలను డ్రా తీశారు. కావేటి యలమందరావు స్మారకార్థం కేసీఎల్ క్రికెట్ టోర్నమెంట్ పదేళ్లుగా తెనాలిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు రూ.10,116, రూ.5,116 చొప్పున అందిస్తామన్నారు. టోర్నమెంట్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు-కృష్ణా జిల్లాల కృష్ణబలిజ సంఘ అధ్యక్షుడు కోలా మణికంఠ, కావేటి వేణుగోపాల్, పాశం వెంకటేష్, పాశం వెంకట్రావు, అన్నం మురళి, శ్రీను, ఓం షిరిడీ, కావేటి శివరామ్, కె.అనిల్, అచ్యుత వేణు, శ్రావణ్, ఎం.కిరణ్, ప్రశాంత్, సురేష్, ప్రదీప్, కావేటి గోపి, సాయి, అన్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన పెంచుకోవాలి

లక్ష్మీపురం: ఆయుర్వేదం అనేది ఒక వైద్య విధానం మాత్రమే కాదని జీవన శైలి కూడా అని, శరీరం మనస్సు, ఆత్మ సమతుల్యతను కాపాడంపై ఆయుర్వేదం దృష్టి పెడుతుందని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ పి.వి.నాగేంద్రం అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్యసభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ వ్యాధుల మూలాలను తెలుసుకుని రోగ ఉపశమనం కన్నా రోగ నివారణకే ప్రాధాన్యం ఇచ్చే ఆయుర్వేదం సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని చెప్పారు. తనకు కలుగుతున్న బాధలను నివారించుకోవటానికి ప్రకృతిలో లభ్యమవుతున్న అనేక వృక్ష ఖనిజ, రసాయిన పదార్థాల పరిశోధన ఫలితమే ఆయుర్వేదమన్నారు. వెన్ను సంబంధిత వ్యాధులు అయిన సయాటిక సర్వైకల్ స్పాండిలైటిస్‌లు 95 శాతం సర్జరీలు అవసరం లేకుండానే ఆయుర్వేద చికిత్సల ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఆయుర్వేదంలో పంచకర్మ విధానం బాగా ప్రసిద్ధి చెంది ఉందని ఈ విధానం ద్వారా కండరాలు, నరాలకు సంబంధించిన అనేక వ్యాధులకు విముక్తి కలుగుతుందని చెప్పారు. సమతుల్య ఆహారం, వ్యాయామం ఆరోగ్యకరమైన జీవన శైలి గురించి ఆయుర్వేదం వివరిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్రను సత్కరించారు.



మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యులు నాగేంద్రం

'బాల్యమిత్ర'.. సేవా తత్పరత

- ప్రత్యేకత చాటుతున్న పూర్వవిద్యార్థులు
- ఘనంగా సంఘం పదో వార్షికోత్సవాలు



బాల్యమిత్ర సభ్యులు

తెనాలి: ఒకనాటి హైస్కూలు నేస్తాలు వాళ్లు... చదువయ్యాక ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. రీయూనియన్ పేరుతో ఏదో ఒకసారి కలుసుకోవటంతో సరిపెట్టుకోలేదు. 'బాల్యమిత్ర' సంఘంగా ఏర్పడ్డారు. ప్రతి నెలా స్థానిక స్కూల్ నేస్తం నడుపుతున్న రెస్టారెంటులో కలుస్తున్నారు. ఏదో ఒక సేవా కార్యక్రమం చేస్తున్నారు. ఆ క్రమంలోనే ఆదివారం స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో బాల్యమిత్ర పదో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక తాలూకా హైస్కూలుకు మారీసుపేట మఠం బజారులో గల బ్రాంచ్ హైస్కూలులో చదువుకున్న పూర్వ విద్యార్థులు వీరు. అధ్యక్షుడు గాదె శంకరరావు, ఏవీ పాండురంగారావు సారథ్యంలో 'బాల్యమిత్ర' ఆవిర్భవించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వార్షికోత్సవంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. తమతోపాటు చదువుకుని ఐఆర్ఎస్‌ను సాధించి, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ కమిషనరు హోదాలో ఉన్న పి.ఆనంద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా ఆ ఉన్నతాధికారి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సాహక బహుమతులు అందించారు. కవితలు చదివారు. పాటలు పాడారు. జ్ఞాపకాలను కలబోసుకుంటూ మధ్యాహ్నం విందుభోజనం చేశారు. సాయంత్రం వరకు రకరకాల ఈవెంట్లతో సంతోషంగా గడిపారు. మధురానుభూతులను మూటగట్టుకుని తిరిగి పయనమై వెళ్లారు. అన్నవరపు సురేష్, బీటీవీఎస్ నారాయణ, శరత్, అంగిరేకుల ప్రసాద్, మల్లెల సత్యనారాయణ, భాస్కర్, కలాం, తుంపూడి సత్యం, చేపూరి రమేష్, చౌట సత్యం తదితరులు పాల్గొన్నారు.

'బాల్యమిత్ర'తో సమాజసేవ



పూర్వ విద్యార్థులందరం పదేళ్ల క్రితం బాల్యమిత్ర సంఘంగా ఏర్పాటయ్యాం. ప్రతి నెలా కలుసుకుంటూ టెన్త్ మెరిట్ విద్యార్థులకు బహుమతులు, బడుల్లో బ్యాగులు, భోజనం ప్లేట్లు, అన్నదానం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మిత్రులకు సాయం వంటి సేవలను అందిస్తున్నాం. దూర ప్రాంతాల్లో ఉన్న స్నేహితులు ఆర్థికతోడ్పాటు ఇస్తున్నారు.

– గాదె శంకరరావు, అధ్యక్షుడు

నేస్తాలతో గడపటంలో ఆనందం



పద్నాలుగేళ్ల ప్రభుత్వ ఉద్యోగం చేశా. సంతృప్తిగా అనిపించలేదు. రాజీనామా చేసి ఫిజిక్స్ లెక్చరర్‌గా స్థిరపడ్డాను. ఒక ప్రముఖ కార్పొరేట్ కాలేజీ చెన్నై బ్రాంచిలో పాతికేళ్లుగా చేస్తున్నా. ఎందరో విద్యార్థులు ఇంజినీర్లు, డాక్టర్లు అయ్యేందుకు తోడ్పడిన సంతృప్తి ఉంది. మరోవైపు నా చిన్ననాటి నేస్తాలను కలుసుకుంటున్నాం. పదో వార్షికోత్సవం వరకు వచ్చామంటే చాలా సంతోషంగా ఉంది.

– మల్లెల సత్యనారాయణమూర్తి, చెన్నై

మిత్రులను కలవాలని తహతహలాడా



పదో వార్షికోత్సవంలో పాల్గొనేందుకు ముందు రోజు రాత్రే తెనాలి చేరుకున్నా. ఎప్పుడెప్పుడు తెలవారుతుందా అని తహతహలాడుతూ ఎదురుచూశాను. నిద్రే పట్టలేదు. ఈ రోజు మిత్రులందరినీ చూడటంతో గత జ్ఞాపకాలన్నీ కళ్లముందు కదలాడుతున్నాయి. సైకాలజీలో పీజీ చేసి, వెబ్ చానల్‌లో కంటెంట్ ఎడిటర్‌గా పని చేస్తున్నాను. బాల్యమిత్ర సభ్యుడిగా ఉన్నందుకు గర్వపడుతున్నా.

– పీబీవీ గణేష్, హైదరాబాద్

మహంకాళి ఆలయంలో చండీహోమం



దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజుకొండూరు గ్రామంలో కొలువైన శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. పూజాకార్యక్రమాల్లో భాగంగా అమ్మవారు శ్రీసరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హోమం క్రతువులో దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తుల ఏర్పాట్లను ఈవో కె.సునీల్ కుమార్ పరిశీలించారు.

తీరు మార్చుకోకుంటే పీడీ యాక్ట్ అమలు చేస్తాం

మంగళగిరి టౌన్: రౌడీషీటర్లు తమ తీరును మార్చుకోకపోతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్ హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, రౌడీషీటర్లు నివసించే ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కొందరు రౌడీషీటర్లు తెలిసీ తెలియక చేసిన నేరాలతో రౌడీషీటర్లుగానే కొనసాగుతున్నారని, దీని వల్ల వారి కుటుంబ సభ్యులు సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని అన్నారు. ఇప్పటికైనా సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రవీంద్ర నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులకు ఖండన

దుగ్గిరాల: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక దళితులపై దాడులు అధికంగా జరుగుతున్నాయని రాష్ట్ర గవర్నర్‌కి బహిరంగ లేఖను ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎమ్మార్పీఎస్ లీగల్ సెల్ కన్వీనర్ న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ రాశారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో దళితులపై దాడులు జరుగుతున్నాయని వివరించి, బహిరంగ లేఖ పంపనున్నామని తెలిపారు. లేఖలో దళితులపై దాడులు అరికట్టాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. 20 ఏప్రిల్ 2025లో పిఠాపురంలో జనసేన పార్టీ కి చెందిన శెట్టి బలిజ పెత్తందార్లు దళితులను సాంఘీక బహిష్కరణ చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కిన్నెర నాగరాజు మాదిగ, ఎస్సీ నాయకులు కట్టా అశోక్, కృష్ణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై మంగళవారం జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం గ్రామంలో రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షన సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకరరావు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర లభించడం లేదని, మిర్చి, పొగాకు ధరలు లేక రైతులు విలవిలలాడుతున్నారని, పెసలు, మినుములు, శనగలకు గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రక్షించే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నామన్నారు. తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ పంట కాలువలోకి మురుగు నీరు కలవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పంట కాలువలో మురుగును అరికట్టాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు, కౌలురైతులు తదితరులు పాల్గొన్నారు.